# నేలతల్లి

''బాపూ! అవ్వ, నువ్వు నాతోని వచ్చెయింౘ్రడి... ఇక్కడుండిచేసేదేం లేదు... ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోరు...''

తిరుపతయ్య మాటలకు రోషమొచ్చింది లసుమయ్యకు.

''నీతో నచ్చి నీ మోచేతికింది నీళ్ళు దాక్కుంట ఉండుమన్నవా...? కోడలెప్పుడు బువ్వపెడ్తతో, కొడుకెప్పుడు ఐదురూపాయలిత్తడో అనిచూసుకుంట కూసుండాలెగద...'' అన్నాడు ముఖం చిట్లించి.

''అవేం మాటలు నాన్నా? నేన్నీ కొడుకును కాదా...? నీ కొడుకింట్లో నువ్వుండడం తప్పా...? నాలుగేండ్లుగా మొత్తుకుంటున్నా మీరు కదలరు, మెదలరు...'' బాధపడుతూ అన్నాడు తిరుపతయ్య.

''తప్పో, ఒప్పో నాకు తెలవది... పుట్టి పెరిగి నూరును, ఈ మట్టిని విడిసి పెట్టి నేను నీతోని రాను... చావయిన, బతుకయిన నాకిక్కన్నే నా పానమిక్కనేపోవాలె... నన్ను ఈ భూమిల్నే కాలెయ్యాలె...'' లసుమయ్య ముఖంలో దృఢ నిశ్చయం.

''బాపూ! నేనెంత మొత్తుకున్నా నీ మొండి పట్టుదల విడవనంటవు... మీ ఇద్దరికోసం ఇక్కడో సంసారం, మా కోసం గోదావరి ఖన్లో సంసారమంటె నానుంచిగాదు... ఆ భూముంటె నువ్వీ ఊరు వదిలిపెట్టవు... దానిమీద పెట్టుబడి పెట్టడం నానుంచి గాదు... దాన్నమ్మివెళ్ళి పోదాం... కుండలగల్లది కలో గంజో తాక్కుంట అందరమక్కన్నే బతుకుదాం...''

కొడుకు మాటలకు గయ్‌మని లేచాడు లసుమయ్య.

''అగో... మల్ల గదే మాటంటవు...? నేం జచ్చినా దాన్నమ్మనియ్య. ఆ యింత భూమమ్మితె మనకు చాటెలుపు భూమన్న లేకుంటయితది... అసలే భూమి లేకుంటె రైతుకెంత నామర్దా...? ఆ భూమిల నా చెమటుంది. నా రగుతముంది. నా సరువముంది... దాని కోసం నా బొక్కలన్ని కలికలైనయి. నువ్వు పైసలియ్యకు పో... దాన్నైతే అమ్మనియ్య...'' ఆవేశంతో ఊగిపోతూ అన్నాడు లసుమయ్య.

ఆ భూమిని అమ్ముతానంటే తండ్రి భావావేశానికి లోనుకావడం తిరుపతయ్యకు కొత్త కాదు... కాని తానెంత ఇదిగా చెప్పినా విన్పించుకోని తండ్రిపై కోపమొస్తున్నా, నెమ్మదిగా అన్నాడు తండ్రితో.

''నేను మాత్రం రైతుబిడ్డను కాదా...? నాలుగేళ్ళ క్రితం వరకు నీతోపాటు నేనూ మట్టిలో

మట్టె బొర్లలేదా...? రైతుకు భూమి మీదెంత ప్రేముంటదో నాకు తెలియదా బాపు...? కానా భూమితోనష్టాలే తప్ప లాభాలు లేనప్పుడు దాన్నెందుకుంచుకోవాలి...? ఈ భూమితో బతకడం సాధ్యం కాకనే పొట్ట చేతబట్టుకొని నేను సింగరేణి ఉద్యోగాని కెళ్లింది మీకు తెలియదా బాపు...'' అన్నాడు.

''మరి ముసలోల్లున్నరు... వాళ్ళకు పని చాతగాదు... చంపి పారేత్తె ఐపోతదిగద... లాభాలత్త లెవ్వని భూమినమ్ముతడట... భూమినమ్ముతె కన్న తల్లి నమ్ముకున్నట్టేరా...''

తండ్రి మాటలు సూటిగా తగిలి తిరుపతయ్య మనసు తట్టుకోలేక విలవిలలాడింది. ''బాపూ? ఊళ్ళో నువ్వొక్కనివేరైతు వున్నవా...? ఎంత మంది భూములమ్ముకోలేదు? మనంగూడ అమ్మినం గదా...? ఇంకొద్ది రోజులంటె అప్పులు పెరిగి భూమి, ఇల్లు ఆఖరుకు నన్నుగూడ అమ్మ వలసొస్తది...''

''అమ్ముకు నెటోడమ్ముకుంటడు... నేను బతికినన్ని రోజులా భూములుండాలె... ఆయింతమ్మి బువ్వెయ్యిమని నీ ఇంట్లుండ... నువ్వేం పైసలు పంపకు... నీనౌకరి పైసలతోని బంగులాలే కట్టుకో... ఇంకేమన్న చేసుకో''

''బాపూ? నీ దారి నీదే కాని నన్నర్థం చేసుకో వెందుకు...? ఆ భూమినమ్మి నేనేమన్న తింటననుకుంటన్నవా...? అవ్వ! నువ్వయిన చెప్పు బాపుకు... దానిమీద పెట్టుబడి పెట్టడం నాకు చాతగాదు... నువ్వు చెప్పే అవ్వ...''

అక్కడే కూచొని వాళ్ళ మాటలు వింటున్న రాజమ్మ, కొడుకు మాటలతో ఇరుకునపడింది. ఆమె పరిస్థితిప్పుడు అడకత్తెర మధ్య పోకలా ఉంది. ఆ భూమంటే భర్తకెంత ప్రాణమో ఆమెకు తెలిసు... యాభై ఏళ్ళుగా లసుమయ్యతో కాపురం చేస్తున్న ఆమెకు భూమినే నమ్ముకొని బతుకుతున్న భర్త స్వభావం తెలుసు...

ఆమె కారపరానికొచ్చే సరికి లసుమయ్య తండ్రిచ్చిన ఐదెకరాల భూముండేది వాళ్ళకు. క్రమక్రమంగా ఆ ఐదెకరాలూ పోయింది. ఇప్పుడు మిగిలిన రెండెకరాలు లసుమయ్య అచ్చుకట్టుకున్న ఆతని స్వార్జితం.

ఆ భూమిని ప్రాణాధికంగా ప్రేమించే భర్తను దాన్నమ్మమని చెప్పలేదు. అట్లనికొడుకును తప్పుపట్టడం లేదామె... సింగరేణి బొగ్గుగనుల్లో ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పనిచేస్తున్న కొడుకు చెప్పేది నిజమే ననిపిస్తుందామెకు... వ్యవసాయం చేస్తే నష్టాలు తప్పడం లేదు. ఆ నష్టాలను కొడుకు భరించాల్సొస్తుంది. కొడుకుదేం పెద్ద నౌకరి గాదు... వ్యవసాయం వద్దంటే భర్త వినడు... వాళ్ళ నొప్పించే శక్తి ఆమెకు లేదు.

''నేనేం జెయ్యాలె బిడ్డ... విడువమంటెపాముకోపం... మింగుమంటె కప్పకోపం... ఆయినేమొ గట్లనాయె... నువ్విట్లనాయె... భూమి నిడువుమంటె మీ బాపినడు... అదుంటేనేమొ నీకు బరువైతంది... నేం జెప్పుతె వినెటోల్లెవ్వలు...? మీ నడుమ నేనెడ బోవాలె...?'' అని అక్కణ్ణుంచి లేచి వెళ్ళిపోయింది రాజమ్మ.

తల్లి చేతులెత్తేసరికి ఒంటరిగా మిగిలాడు తిరుపతయ్య. ఆతనికి చికాకుగా ఉంది... బాధగా ఉంది... కోపంగానూ ఉంది.

''మీ కడుపులో పుట్టిన కర్మానికి నన్ను 'నాశినం' చెయ్యండ్రి... నా నాశినమే మీరు

కోరుకుంటున్నట్టుంది... బొగ్గుల బొగ్గై సంపాయించుకొచ్చిన పైసల నామట్లె నాశినం జెయ్యిండ్రి... రోజుకింత అప్పు పెరిగికట్టలేక నేం జత్త.. ఆ భూమిలేం పాడైందిబాపూ...? అది మనల్ని 'మోసం' చేస్తుంది....మనల్ని 'నాశినం'చేస్తుంది. నా నాశినం చూడాలంటే ఆ భూముంచుకోండ్రి''... కోపంగా అని లుంగీసర్దుకుంటూ విసురుగా ఊళ్ళోకి వెళ్ళిపోయాడు తిరుపతయ్య.

కొడుకు మాటలు శూలాల్లా తగిలాయి లసుమయ్యకు. ఆతని మనసు భరింపరాని వేదనతో మూలిగింది. 'భూమిమోసం చేస్తుంది.. నా నాశినమే కావాలి మీకు' అన్న వాక్యాలే ఆతని చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

'నాశనం, మోసం' అన్న పదాలాతన్ని హృదయాన్ని తొలిచేస్తున్నాయి.

కొడుకంటే తనకు ప్రాణంకంటే ఎక్కువే... కొడుక్కూ తమంటే అంతే...

చాలామంది కొడుకుల్లా కాకుండా తిరుపతయ్య వృద్ధాప్యంలో తమకు చేదోడువాదోడుగా వుంటున్నాడు. అలాంటి కొడుకు నాశనాన్ని తాను కోరుకుంటున్నాడా?

భూమిమోసం చేస్తుందా...? రైతును నాశనం చేస్తుందా...? భూమెప్పుడూ రైతును మోసం చేయదు. అది తనొప్పుకోడు.. మరి భూమినే నమ్ముకొని బతుకుతున్న తన లాంటి రైతులెందుకు రోజురోజుకూ దిగజారిపోతున్నారు...? భూమిపుత్రులంతా భూమిలేని వాళ్లుగా ఎందుకవుతున్నారు? ఎక్కడో మోసముంది. భూమి మాత్రమెప్పుడూ మోసం చేయదు.

యాభై ఏళ్ళుగా భూమినే నమ్ముకొని బతుకుతున్న లసుమయ్యకు భూమిమోసం చేస్తుందంటే నమ్మబుద్ధి కావడంలేదు.

'మరెక్కడుంది మోసం...?' తనను తానే ప్రశ్నించుకున్నాడు.

లసుమయ్య మనసంతా వికలమైంది. హృదయం కోళ్లు దవ్విన పెంటలా ఉంది.

తాను కూర్చున్న నులకమంచాన్ని తీసుకెళ్ళి 'సాయమానిల్లు' పక్కకున్న చింతచెట్టుకింద వేసుకున్నాడు. రుమాలు తీసి తలకింద పెట్టుకొని వెల్లికిలా పడుకున్నాడు.

ఆతని మనసెక్కడెక్కడో తిరుగుతుంది. నాశనం, మోసం అన్న పదాలు వెంటాడుతుండగా యాభై ఏళ్ళుగా రైతుగా గడుపుతున్న జీవిత పుటలను తిరగేస్తుంది.

భూమి పుత్రుడుగా భూమితో తన అనుబంధం ఎలా పెనవేసుకుపోయిందో జ్ఞాపకంచేసుకుంటూ లసుమయ్య గతంలోకెళ్ళాడు.

★★★

పదేళ్ళ వయసులోనే తండ్రితో పాటు నాగటి 'పాలె' చేతిలోకి తీసుకున్నాడు లసుమయ్య. ఆరిందలా పనిచేశాడు... ఎడ్లు కాశాడు. ఒడ్లు చెక్కాడు... నాగలిదున్నాడు... జంబుగట్టాడు...మోట గట్టాడు... నీళ్ళు గట్టాడు.. కోతకోశాడు... మోతమోశాడు... బంతిగట్టాడు... వ్యవసాయ పనులన్నీ చేశాడు...

అంతా తానే అయి పనిచేశాడు... ఎంతో ఆరాటపడుతూ పనిచేశాడు. తొలకరి సమయం ఆరంభమైందంటే వర్షం కొరకు ఎదురుతెన్నులు చూసేవారు. కొంచెం ఆలస్యమైతే దేవుళ్ళకు పేరు పేరునా మొక్కేవారు. ఊళ్ళో వానదేవుని పాటలు పాడించే వారు. విరాటపర్వం కథ చెప్పించే వారు. హరి కథలు చెప్పించేవారు కప్పతల్లాటలో లసుమయ్య శరీరం తడిసి ముద్దయ్యేది.

తొలకరి సమయంలో ఆకాశంలో మబ్బు తునక కనపడితే లసుమయ్య హృదయముప్పొంగేది. చినుకు రాలితే ముత్యాలజల్లులా తోచేది. ఓ పెద్ద వాన పడగానే ఊరికంటే ముందే పునాస' విత్తనాలేసేవాడు లసుమయ్య. మొక్క భూమిని చీల్చుకొని పైకొస్తుంటే ఆతని మనసానందంతో గంతులేసేది. అది క్రమక్రమంగా పెరుగుతుంటే పొంగిపోయేవాడు.

ఒక్కోసారి లేత మొక్కలు వర్షాలు లేక మాడిపోతుంటే విలవిలలాడిపోయేవాడు.

ఎండాకాలంలో పంటలు చేతికొచ్చే సమయంలో ఆకాశంలో మబ్బుతునక కనబడితే ఆతని ఆందోళన వర్ణనాతీయం... చెడగొట్టు వానలొచ్చేట్టున్నాయని ఆవేదన చెందేవాడు.

ఎన్నోసార్లు పంట నూర్పిళ్ల సమయంలో రాళ్ళవాన పడో, పెద్ద పెద్ద గాడ్పు దుమారాలొచ్చో చేతికొచ్చిన పంట నోటికి రాకుంటయితే విలవిలలాడిపోయేవాడు. ఏ కాలానికనుగుణంగా ఆకాలంలో వాతావరణముంటే మంచి పంటలొస్తాయని లసుమయ్య నమ్మకం.

ఒక్కోసారి చలి విపరీతంగా వుండాల్సిన సమయంలో ఎండలు మెండుగా కొడుతుంటేమొక్కలకు రోగాలొస్తాయని ఆతని మనసు ఆందోళనచెందేది.

కుండపోత వర్షాలు, మండుటెండలు, ఎముకలు కొరికే చలి, గాలి, ధూళి దేనిని లక్ష్యపెట్టకుండా వ్యవసాయ పనులు చేసేవాడు.

తన పంటను కంటికి రెప్పలా కాపాడుకునే వాడు. పంట మొక్కలను తన శరీరభాగాలకంటే ఎక్కువగానే భావించేవాడు.

పంటకొరకు లసుమయ్య వానలో నానాడు... ఎండలో ఎండాడు.... చలిలో వణికాడు... దుబ్బులో దుబ్బయ్యాడు... మట్టిలో మట్టయ్యాడు.

ఇరవై ఏళ్ళ వయసులో 'వేరు' పడ్డాడు లసుమయ్య. అతని ఆరాటం మరింత పెరిగింది. తండ్రిచ్చిన భూమితోపాటు మరింత కొనుక్కోవాలని శాయశక్తులా కృషి చేశాడు.

ఈలోగా వరుసగా నలుగురాడపిల్లలు పుట్టారు. చివరివాడు తిరుపతయ్య.

తుప్పలతో, రాళ్ళతో ఎన్నో ఏళ్ళుగా బీడు పడున్న అయ్యగారి భూమిచాలా తక్కువ ధరకు వస్తుందంటే రెండెకరాలుకొంటానన్నాడు లసుమయ్య.

''బాయి లేదు... కాలువ నీళ్ళు లేవు... అడివోలుంది... దాంట్లేం పండుతయని కొంటనన్నావు...'' అన్నారాతని మిత్రులు.

''భూమి కొంటె మునుగుతవు.. మేం చెప్పింది విను...'' అన్నారు. అయినా ఎవరి మాటలు లక్ష్యపెట్టలేదు. ఆ భూమిని కొన్నాడు. దాన్ని సాగులోకి తేవడానికి అహోరాత్రులు శ్రమించాడు. దాన్నో సవాలుగా తీసుకున్నాడు. ఆ చేల్లోనే చిన్న గుడిసేసుకున్నాడు.

తుప్పలన్నీ నరికేశాడు. ఎత్తు వంపులనుపూడ్చేశాడు. పశువుల పెంట ఏరుకొచ్చేశాడు. గొర్రెరువుపోశాడు. పంది ఎరువును కొనుక్కొచ్చి వేశాడు. ఎండాకాలంలో చెరువులోంచి పాటుమట్టి తవ్వుకొచ్చి చేనంతా పోశాడు.

ఇంటిల్లిపాదీ రెండేళ్ళు ఒళ్ళు హూనం చేసుకొని ఆ భూమినో రేవుకు తెచ్చేరు.

చాలా కాలంగా బీడుగా వున్న ఆ భూమిని దున్నడానికి ఎంతో కష్టమైంది. ఐదారు నాగలి దుంపలిరిగాయి. అయినా ఆ పనినో యజ్ఞంగా భావించి సాగులోకి తెచ్చాడు. మొదట్లో వర్షాధారంగా పండే

పెసరు, జొన్న, పల్లిలాంటి పంటలేశాడు. అటు తర్వాత దానికి నీటి వసతి కల్గించాలని 'బావి' పట్టాడు. చిన్న పిల్లలతో సహా అందరూ ఆ బావి తవ్వడంలో నిమగ్నమయ్యారు. కొంత కూలీలనూ పెట్టక తప్పలేదు. తీరిక సమయాల్లో నాలుగైదేళ్ళు తవ్వితే కానీ ఆ బావి ఉపయోగంలోకి రాలేదు.

ఎంత కష్టపడుతున్నా, బొడ్డూడని పిల్లల వయసునుంచే ఇంటివాళ్ళంతా పనిచేస్తున్నా, లసుమయ్యకు భూములమ్మక తప్పలేదు. నలుగురు కూతుర్ల పెళ్ళిళ్ళు, పెట్టుబోతలవీ అయిపోయేసరికి తండ్రిచ్చిన ఐదెకరాల భూమి హారతి కర్పూరంలా కరిగిపోయింది.

భూములమ్మడం ఎంత బాధగా వున్న, అవి కూతుర్ల పెళ్లి అవసరాల కోసమని సరిపుచ్చుకున్నాడు లసుమయ్య... ఏడెనిమిదేళ్ళుగా తాను కొన్న రెండెకరాల భూమి పైన్నే ఆధారపడి బతుకుతున్నాడు లసుమయ్య. దానికి తోడు ఇతర్ల భూమిని కొంత 'పాల్ల'కు దుంతున్నాడు.

తన జీవితాన్నంతా ఒక్కసారి మననం చేసుకున్నాడు లసుమయ్య. 'తనలాంటి భూమి పుత్రులెంత కష్టపడుతున్నా, మట్టిలో మట్టయి పనిచేస్తున్నా తమ చేతుల్లోంచి భూములెందుకు పోతున్నాయి? తనను తానే ప్రశ్నించుకున్నాడు లసుమయ్య.

ఇరవై నాగళ్ళ వ్యవసాయముండే ఆకారపు వాళ్ళు భూములన్నీ పోగా ఊరొదిలి వెళ్ళిపోయిన సంగతిజ్ఞాపకం వచ్చింది లసుమయ్యకు. అలాగే పదినాగళ్ళ వ్యవసాయమున్న వేముల వాళ్లకు చారెడుభూమి కూడా లేకుండా కావడం ఆతనిజ్ఞాపకాల్లో కదిలింది.

దాదాపు పాతికేళ్లుగా చాలా మంది ఊళ్ళొదిలి వెళ్లిపోవడం గమనిస్తున్నాడు లసుమయ్య.

'వాళ్ళు కూచొని తినాలనుకోవడం వల్ల వాళ్ళ వ్యవసాయాలు దెబ్బతిన్నాయనుకున్నా రెక్కలు, ముక్కలు చేసుకొని పనిచేసే చిన్న వ్యవసాయాలు కూడా ఎందుకు మూలబడుతున్నాయి?' ప్రశ్నించుకున్నాడు లసుమయ్య.

మార్తం నర్సయ్య, దొంగల హనుమయ్య, గొట్టం రాజయ్య, కోడూరి మల్లయ్య... ఇలా ఎంతోమంది తనలాంటి రైతులు భూములమ్ముడుపోగా ఊళ్ళొదిలి పోయినవాళ్ళు జ్ఞాపకం వచ్చారు లసుమయ్యకు.

'' ఇలా ఎందుకు జరుగుతుంది?'' ప్రశ్న వేసుకున్నాడు. ఆతని కళ్ళముందెన్నో విషయాలు కదులుతున్నాయి.

అతివృష్టి, అనావృష్టి, వడగళ్ళ వానలు, గాడ్పు దుమారాలు... లాంటి ఎన్నో ప్రకృతి వైపరీత్యాలు ఆతనికి జ్ఞాపకం వచ్చాయి.

నీటి వసతి లేకపోవడం... ప్రభుత్వ అప్పులు... ప్రైవేట్ అప్పులు.. మరెన్నో విషయాలాతని స్మృతి పథంలో కదిలాయి.

అయితే లసుమయ్య యాభై ఏళ్ళ రైతు జీవితం, అరవై ఏళ్ళ జీవితానుభవాలు- ఇవన్నీ స్వల్పకారణాలేనని చెబుతున్నాయి.

రైతు పతనానికి వెనుకేదో కుట్ర వున్నట్టాతనికి అర్థమవుతుంది... తన అనుభవాలనన్నీ జోడించి ఆలోచించిన లసుమయ్యకు ఆ కుట్రేంటో ఇప్పుడు స్పష్టంగానే తెలుస్తుంది. అయితే ఆ కుట్రను భగ్నం చేయడం మాత్రం తనలాంటి వాళ్ళనుంచి కాదనిపిస్తుంది,.

రెండు రోజులు తర్జనభర్జన చేసుకున్న తర్వాత, లసుమయ్య కొడుకుకు చెప్పించే

చేయాలనినిర్ణయించుకున్నాడు.

★★★

కొడుకు పక్కన నులకమంచంలో కూర్చొనున్నాడు లసుమయ్య. వాళ్ళకెదురుగా మొగురానికొరిగి రాజమ్మ కూర్చొనుంది.

''తిరుపతీ! నువ్వన్నట్టు ఆ భూముంటెరెండు సంసారాలైతయి. దాంట్ల పండింది లేదేం లేదు. నీకు నష్టమైతది. అప్పులు గట్టలేక నువ్వు సావాలె... దాన్నమ్మిపారేత్తాం. కోమటయినెను పిలువు. సంతుకాలు పెట్టి పారేత్త...'' కనుగుడ్ల నిండా నీళ్ళుబుకుతుండగా అన్నాడు లసుమయ్య.

రెండు రోజులుగా తండ్రిలో జరుగుతున్న అంతర్మథనాన్ని గమనిస్తున్న తిరుపతయ్య, ముసలి ప్రాణాన్ని ఉసూరుమనిపించకూడదని నిర్ణయించుకున్నాడు. భూమి నమ్మాలని తండ్రిని బలవంతం చేయకూడదనుకున్నాడు. తండ్రి తానన్న మాటలకు బాధపడి ఈ నిర్ణయం తీసుకున్నాడేమో ననుకున్నాడు.

''బాపూ! నేనన్నదానికి బాధపడకు. ఆ భూముండనీయి... నేనెలాగో వెళ్ళదీసుకుంటాను'' అన్నాడు.

''వద్దు బిడ్డా! నేం గూడ భూమితో నలిసిపోయిన... ఇగ నానుంచి గాదు... నీ మనసులో ఏముంచుకొని ఆ మాటన్నవో నాకు తెలువది కాని ఆ భూమిని పట్టుకొనుంటెనేను నా శివమవుడేకాదు... నువ్వుకూడ నాశినమవుతవు... అది నా కిష్టంలేదు...''

ఇప్పటికైనా తండ్రి పరిస్థితుల నర్థం చేసుకున్నందుకు సంతోషపడాలో, తాను ప్రాణాధికంగా ప్రేమించిన భూమిని వదులుకోబోతున్నందుకు విచారపడాలో తిరుపతయ్య కర్థం కావడంలేదు. తిరుపతయ్యకూ ఆ భూమిని అమ్మడం బాధాకరంగానే వుంది.

''బాపూ! బాగా ఆలోచిస్తే మనలాంటి రైతులిలా అవడానికి వెనుక ఏదో కిటుకుందనిపిస్తుంది. రాయలసీమలో అసలే నీటివసతి లేదు. అక్కడి రైతు పరిస్థితి దుర్భరంగా వుండడానికి కారణం అదేననుకుందాం. తెలంగాణాలో నీటి వసతి ఓ తీరుగా వుంది. అయినా ఇక్కడా రైతు పరిస్థితేమంత బాగాలేదు.

మొన్నటికిమొన్న కరీంనగర్ జిల్లాలో ఓ రైతు కోఆపరేటివ్ బ్యాంకు అప్పు కట్టలేక అవమానంతో ఆత్మహత్య చేసుకున్నాడు...

కోస్తాప్రాంతంలో నీరు పుష్కలంగా ఉంది... అయినా అక్కడ కూడా రైతుల ఆత్మహత్యల వార్తలు వింటున్నాం. ప్రకాశం జిల్లాలో పొగాకు రైతుల ఆత్మహత్యలు మనకు తెలిసినవే... మూడు ప్రదేశాల్లోనూ ఇ[illegible]డం నాకు వింతనిపిస్తుంది...'' నాలుగేళ్ళుగా కార్మికుడుగా పొందుతున్న చైతన్యంతో తనకు [illegible]యాలను చెప్పాడు తిరుపతయ్య.

''అవు బిడ్డా... నువ్వు చెప్పింది నిజమే...''

''అందుకే భూమిని నమ్ముకుంటే లాభం లేదు... అది రైతును మోసం చేస్తది...''

కొడుకు మాటలు విని గుర్మని లేచాడు లసుమయ్య. లేచి నిల్చున్నాడు-చేతులూపుతూ.

''నాకు నీ[illegible]తండు మొగోడు-భూమి మోసం సేత్తదా? భూమిని నమ్మితె ముంచుతదా? భూమెప్పుడు మోసం [illegible]ది... ముంచది. మోసం చేసేది, ముంచేది మనిషే. ఎవుసదారునిమీద కుట్రచేత్తున్న[illegible]షే...'' ఊగిపోతూ అన్నాడు లసుమయ్య.

తండ్రి భుజాలు పట్టుకుని తన ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు తిరుపతయ్య. తానేం మాట్లాడితే

తండ్రికేం కోపం వస్తుందోనని మౌనంగా కూర్చున్నాడు. రాజమ్మ ఇద్దర్నీ చూస్తూ నిల్చుంది- కొద్ది నిమిషాలు వాళ్ళ మధ్య నిశ్శబ్దం రాజ్యమేలింది.

''కొడుకా! పంటకు రోగాలత్తె మందులేసి జయించిండు రైతు. నీళ్ళు లేకుంటె బాయి తవ్వి గెలిచిన... వాతావరణాన్ని బట్టి పంటలేసి ప్రకృతిని జయించవచ్చు... మరి మనచేతిల లేనిదాన్ని గెలుచుడెట్ల...?''

తండ్రి మాటలను ఆశ్చర్యపోతూ వింటున్నాడు తిరుపతయ్య. ఆతని కళ్ళకిప్పుడు తండ్రి ఎన్నిటినో జీర్ణించుకున్న అనుభవాల పుట్టగా కనబడ్తున్నాడు. కాని తండ్రి చెప్పినరైతు చేతిలో, లేని విషయమేంటో ఆతని కర్థం కావడంలేదు... తండ్రి దిక్కు ప్రశ్నార్థకంగా చూశాడు తిరుపతయ్య.

''తిరుపతీ! నీకు తెలువందేంది...? నువ్వా మొన్నట్రాకమంట్లె బొర్లినోనవే.. మిరుపకాయలకు ధరుందని పంట పండిత్తె పంట చేతిల కచ్చేవారకు దాని ధరమాయమాయె... ఇంకో పారిపల్లికుందనేత్తె దాని సంగతి గట్లనేవాయె... మల్లోసారి పొగాక్కు... గీదరలెందుకు దిగుతయో, ఎందుకు పెరుగుతయో ఎవ్వలకు తెలుపకపాయె.. ఏది మంచిగ పండుతె దాని ధర దిగె... పంట రైతు చేతిల్నుంచి పోయినంక నేమొ ధరలు పెరిగే ఇగపంట పండినా, పండకున్నా రైతుకేమత్తందిచెప్పు...?

మనం పండించినపంట ధర మన చేతులల్ల లేకపాయె... ఇగ గిది కుట్రగా కుంటేందిచెప్పు...? గీకుట్రనుగెలుచుడు మనసుంచైతదా...?''

తిరుపతయ్య కళ్ళకిప్పుడు లసుమయ్య సర్వానుభవాలను జీర్ణించుకున్న రైతు బాంధవుడిలా, రైతు కష్టాలకు నిజమైన భాష్యం చెప్పే భాష్యకారుడిలా అగుపడుతున్నాడు.

''అవును బాపూ! నువ్వన్నది నిజమే. రైతు మీద కుట్ర జరుగుతుంది''.

''నువ్వు ఐదేండ్ల పిల్లగానప్పుడు మసూల్లెకు కట్టుబట్టలతో వచ్చిండు ఎంకటయ్య షావుకారి... ఇప్పుడు ఇరువై ఎకరాల భూమికి, లక్షల రూపాయలకధికారి... మనసోంటోల్లేమొ కిందికే పోతున్నరు... దళార్లు పెరుగుతండ్రు.. రైతులు కుంగిపోతండ్రు... ఈరెండింటి నడమ ఎన్నో కుట్రలున్నయి. ధరల కుట్ర అన్నిటికంటె పెద్దది... షావుకార్ని, పాతపట్వార్ని, పెద్దమనుషులను చేనుకాడికి తీసుకరా నేను పోతన్న...'' అనికట్టె చేతిలో పట్టుకొని చేను దిక్కు నడుస్తున్నాడు లసుమయ్య.

రాతకోతలన్నీ అక్కడే పూర్తయ్యాయి.

విక్రయ పత్రంపై వేలిముద్ర వేస్తున్న లసుమయ్య ఆభూమి, ఆ తర్వాత ఆ ఊరు తనదికాకుండా పోతుందన్న నిజాన్ని జీర్ణించుకుకోలేక పోతున్నాడు... అతని కళ్ళవెంట కారుతున్న నీళ్ళతో ఆ భూమి పునీతమవుతుండగా వేలి ముద్రవేశాడు...

తడిసిన మట్టిని చేతిలోకి తీసుకున్నాడు...

''ఘోరంగా కుట్ర జరుగుతుంది... భూమి మోసం చేయది... మనిషే మోసకారి... వ్యవసాయమే కుట్ర... వ్యవసాయమే కుట్ర...'' హిస్టీరియా వచ్చినవాడిలా అరుస్తూ, ఏడుస్తూ ఊరి దిక్కున నడుస్తున్నాడు లసుమయ్య.

***స్వాతి సచిత్ర మాసపత్రిక జనవరి 1995***

***స్వాతి కథల పోటీలో (1994) బహుమతి పొందిన కథ***